కరీంనగర్ నుంచి రాత్రి వేళల్లో బస్సులు నడపండి

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మంథని నుంచి గోదావరిఖనికి రాత్రి 8గంటలు దాటితే బస్సులు ఉండడం లేదని, రాత్రి వేళల్లో బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు డీఎంకు విజ్ఞప్తిచేశారు. శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు 19మంది సమస్యలను విన్నవించారు. రాత్రి వేళల్లో బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నామని, కరీంనగర్, మంథని నుంచి బస్సుల సంఖ్య పెంచాలని, యైటింక్లయిన్‌కాలనీ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికుల రదీ దృష్ట్యా బస్సులను పెంచాలని, కుమ్మరి కుంటకు టిప్పుల సంఖ్య పెంచాలని కోరారు. తక్కళ్లపల్లి, పాలకుర్తి మీదుగా ధర్మారం, ఎల్కలపల్లి నుంచి సబ్బితం మీదుగా పెద్దపల్లికి బస్సు నడుపాలని, బసంత్‌నగర్ వద్ద నిరుపయోగంగా ఉన్న బస్‌షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

మంథని, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసి ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంథని డీఎం శ్రావణ్ కుమార్ తెలిపారు. సౌకర్యాల కల్పన పై సెల్ నెం. 9959225923 కు కాల్ చేసి దృష్టికి తీసుకురావాలని కోరారు.

- ఓపెన్‌కాని రాజీవ్ యువ వికాసం సైట్
- రెండు రోజులుగా ఇబ్బందులు
- నెట్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు
- ఈనెల 14వ తేదీ చివరితేదీ



ఆన్‌లైన్ అవస్థలు

మంథని, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ఆన్‌లైన్ సైట్ ఓపెన్ కావడం లేదు. దీంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రెండు రోజులుగా యువకులు ఇబ్బంది పడుతున్నారు.

దీంతో ఆన్‌లైన్ సెంటర్లకు దరఖాస్తు కోసం వస్తున్న చాలా మంది నిరుద్యోగ యువతీ యువకులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. మంథని ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం నుంచి సైట్ పని చేయడం లేదు. శుక్రవారం చాలా సెంటర్లలో ఉదయం నుంచి రాత్రి వరకు అప్పుడప్పుడు సైట్ పని చేయ డంతో ఒక సెంటర్‌లో ఐదుకు మించి దరఖాస్తులు అప్‌లోడ్ కాలేదు. ఒక వేళ అతి కష్టం మీద ఓపెన్ అయినా దరఖాస్తు పూర్తి చేసి సబ్మిట్ చేస్తే ప్రక్రియ పూర్తి కాకపోవడంతో దీంతో అటు సెంటర్ నిర్వాహ కులు, ఇటు దరఖాస్తుదారులు తలలు పట్టుకుంటు న్నారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డులు, మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన వందలాది మంది దరఖాస్తుదారులు తమ సర్టిఫికెట్లను, జిరాక్స్ కాపీలతో మీసేవ సెంటర్ల చుట్టూ తిరిగి విసిగిపోతున్నారు. ఒక వైపు ఎండ వేడి, మరో వైపు రేపటి నుంచి వరుసగా 3 రోజుల పాటు సెలవు రోజులు వస్తుండటంతో దర ఖాస్తు దారులు ఆన్‌లైన్ సెంటర్ల చేరుకుంటున్నారు. సాంకేతిక కారణాలతో ఆన్‌లైన్ పని చేయక పోవడంతో సెంటర్ల వద్దనే గంటల తరబడి ఎదురు చూస్తూ అవస్థలు పడుతున్నారు. వేర్వేరు ఆన్‌లైన్ సెంటర్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఇప్పటికే కులం, ఇన్‌కం సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి ఇబ్బందులు పడగా ఆన్‌లైన్ కాకపోవడంతో నిరాశకు గురవు తున్నారు. కాగా, సెలవు దినాల్లో సైతం మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు దారుల అప్లికేషన్లు స్వీకరించడానికి పత్యేక ఏర్పాట్లు చేయడం కొంత ఊరట కల్పించగా రెండు రోజులుగా ఆన్‌లైన్ సైట్ పని చేయకపోవడం, ఈనెల 14వ తేదీ దరఖాస్తుకు చివరి రోజుగా ఉండటంతో దరఖాస్తుదారు లు ఆందోళన పడుతున్నారు. కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి

(మిగతా 8వ పేజీలో)

విద్య ప్రాముఖ్యతను చాటిచెప్పిన పూలే



జ్యోతిబాపూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, అధికారులు

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే జీవితంలో మార్పుసాధ్యమని చాటిచెప్పిన మహనీయులు మహాత్మాజ్యోతిబా పూలే అని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గతంలో కులవ్యవస్థ కారణంగా దళితులు, బడుగు బలహీన వర్గాలు వివక్షతకు గురయ్యారన్నారు. మహిళల అభ్యున్నతి కోసం కృషిచేసిన మహనీయులు పూలే అని పేర్కొన్నారు. సామాజిక సమానత్వం సాధనకోసం జ్యోతిబాపూలే పోరాటం చేశారని, ఆ స్ఫూర్తితో సామాజిక అసమానతలు దూరమయ్యేందుకు మన వంతు కృషిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలు ఏర్పాటు, బీసీ, ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. సమాజంలోని వివిధ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలను అర్హులకు అందే విధంగా అధికారులు, ఉద్యోగులు చిత్తశుద్ధితో కృషిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి జే.రంగారెడ్డి, కలెక్టరేట్ సీవిభాగం పర్యవేక్షకులు ప్రకాష్, జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు శంకర్, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు ఎస్.శంకర్, అధికారులు పాల్గొన్నారు.

కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు



ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఖిలావనపర్తి లక్ష్మీనర్సింహాస్వామి దేవస్థానం కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన అనంతరం కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. కష్టపడి పని చేసి పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. ఖిలావనపర్తి ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అవసరం ఉన్న ప్రభుత్వం తరుపున అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ సంతోష్, కమిటి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కౌటం సతీష్, ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా దేశెట్టి అంజయ్య, సంయుక్త కార్యదర్శిగా ముచ్చకుర్తి కుమారస్వామి, కోశాధికారిగా ఉమర్, క్రీడా కార్యదర్శిగా ప్రదీప్‌కుమార్, సీనియర్ కార్యవర్గ సభ్యులుగా శంకర్, కార్యవర్గ సభ్యులు గోపాల్‌రెడ్డి, పులిపాక రాజ్‌కుమార్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

ఎట్టకేలకు నిధులు విడుదల

- డబుల్ బెడ్‌రూమ్‌ల మౌలిక వసతులకు రూ.10.04కోట్ల కేటాయింపు
- రామగుండానికే రూ.7.61కోట్లు...
- ఎలక్ట్రికల్, మంచినీటి సరఫరా, సీవరేజ్ పనులకు కేటాయింపు



కోల్‌సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లలో మౌలిక వసతులు కరువయ్యాయి. దీంతో లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించినా అందులోకి వెళ్లేందుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీంతో తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మౌలిక సదుపాయల కల్పనకు రూ.10.04 కోట్లు మంజూరు చేసింది. జిల్లాలో 1138డబుల్ బెడ్ రూమ్‌లకు ఎలక్ట్రికల్, సీవరేజ్ లైన్లు, మంచి నీటి సరఫరాకు సంబంధించి ఈ నిధులు వెచ్చించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో డబుల్ బెడ్‌రూమ్‌కు మౌలిక సదుపాయల కల్పనకు రూ.1.25లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.75వేలు కేటాయించారు. దీంతో ఒక్కో యూనిట్ కాస్ట్ గ్రామీణ ప్రాంతాల్లో రూ.5.04లక్షల నుంచి రూ.6.29లక్షలకు, పట్టణ ప్రాంతాల్లో రూ.5.3లక్షల నుంచి రూ.6.05లక్షలకు పెరిగింది.

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 670నివాసాలకు రూ.7.64కోట్లు కేటాయించారు. ఓదెలలో 148 నివాసాలకు రూ.1.45కోట్లు, పెద్దపల్లి అర్బన్‌లో చందపల్లిలో 196, రాంపల్లిలో 128 నివాసాలకు రూ.76లక్షలు కేటాయించారు. ఈ నిధులను ఎలక్ట్రికల్ పనులకు కేటాయించనున్నారు.

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో 670 డబుల్ బెడ్ రూమ్‌లకు మంచినీటి సరఫరాకు రూ.3.01కోట్లు, సీవరేజ్ లైన్లకు రూ.3.05కోట్లు, ఎలక్ట్రికల్ పనులకు రూ.1.2కోట్లు కేటాయిం చారు. ఎలక్ట్రికల్ పనులకు సంబ ంధించి ఎన్‌పీడీసీఎల్, ఓదె లలో మంచినీటి సరఫరా పనులకు సంబంధించి మిషన్ భగీరథ కార్పొ రేషన్, సీవరేజ్ పనులను ఆర్‌అండ్‌బీకి కేటాయిం చారు. రామగుండం మున్సిపల్ కార్పొ రేషన్‌లో రూ.3.01కోట్లతో చేపట్ట నున్న మంచినీటి సరఫరా పను లను నగరపాలక సంస్థకు కేటా యించగా, రూ.3.5కోట్ల సీవరేజ్ పనులను ఆర్ అండ్‌బీకి కేటాయిం చారు. ఎలక్ట్రికల్ పనులను ఎన్‌పీ డీసీఎల్‌కు కేటా యించారు. ఓవర్ హెడ్‌ట్యాంకులు, సీసీ డ్రైన్లు వంటి పనులను నియోజకవర్గాల అభివృద్ధి నిధులతో పాటు ఇతర ప్రభుత్వ స్కీమ్‌ల నిధులతో చేపట్టనున్నారు. మౌలిక సదుపాయలకు నిధులు విడుదల కావడంతో త్వరలోనే డబుల్ బెడ్‌రూమ్‌లు అందుబాటులోకి రానున్నాయి.



కొండగట్టులో హనుమాన్ దీక్షాపరులు

కొండంతా.. కాషాయమయం

- హనుమాన్ చిన్న జయంత్యుత్సవాలు షురూ
- కొండగట్టుకు తరలివస్తున్న దీక్షాపరులు
- నేడు చిన్న హనుమాన్ జయంతి

7

వైభవంగా ప్రారంభమైన రంగనాయకుని బ్రహ్మోత్సవాలు

- వారం రోజుల పాటు పలు వాహన సేవలు



నీరుకుళ్ళలోని రంగనాయక స్వామి ఆలయం

7

గోదావరిని కాలుష్య రహితంగా మారుద్దాం

కోల్‌సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిని కాలుష్య రహితంగా మార్చడం ద్వారా ప్రజలకు పవిత్ర జలాలను అందిద్దామని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అధికారులకు సూచించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ప్రజారోగ్యశాఖ, మున్సిపల్ కార్పొరేషన్, అమృత్ పనులు నిర్వహిస్తున్న ఏజెన్సీలతో సమీక్ష నిర్వహించారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో రూ.88కోట్ల అమృత్ నిధులతో రామగుండం, మల్కాపురం, యైటింక్లయిన్‌కాలనీ, జనగామలలో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణం జరుగాల్సి ఉందని, ఇప్పటికే రామగుండం, మల్కాపూర్, యైటింక్లయిన్ కాలనీల్లో పనులు ప్రారంభమయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని, పది నెలల్లో అందుబాటులోకి రావాలన్నారు. ప్రధాన నాలాల మురుగునీరు నేరుగా గోదావరిలో కలువకుండా శుద్ధి చేసిన తరువాతే కలిసేలా చర్యలు చేపట్టాలన్నారు. జనగామ ఎస్‌టీపీకి సంబంధించి లోకేషన్‌ను మార్చాలని, కొంత ముందుకు మార్చితే ప్రయోజనకరంగా ఉందన్నారు. ఎస్‌టీపీ టెండర్లు పూర్తయి పనులు మొదలవడంతో ఇప్పటికే జాప్యం జరిగిందని, ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రాయింగ్ అప్రూవల్ కాక ఆలస్యమైందని, పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ప్యాకేజీ పనులు సమాంతరంగా జరుగాలని, స్ట్రోమ్ వాటర్ డ్రైన్లు, డైవర్షన్లు, ట్రీట్‌మెంట్ ప్లాంటు పనులు త్వరితగతిన పూర్తి కావాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని, ఎస్‌బీఆర్ టెక్నాలజీతో నిర్మించే ఈ ప్లాంట్లు పూర్తయితే కాలుష్య వాతావరణం ఉండదన్నారు. ఇప్పటికే నగరంలో ప్రధాన నాలాలను ఆధునీకరిస్తున్నారని, ఎక్కడా కచ్చ నాలాలు ఉండవన్నారు. ఎస్‌టీపీల నిర్మాణం పూర్తయితే నాలాల్లో వ్యర్థాలు కలువకుండా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కార్పొరేషన్ ఈఈ రామన్, ప్రజారోగ్యశాఖ డీఈ దేవేందర్‌రెడ్డి, ఏఈలు మౌనిక, మనోజ్, యశోద ఏజెన్సీ ప్రతినిధి ప్రభు, పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న ప్రధాని

ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపించడానికి ప్రపంచంలోనే అగ్రదేశాలతో పోటీపడుతూ ముందుకు నడిపిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో పెద్దపల్లి మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రపంచ దేశాలకు చిన్న చూపు ఉండేదని, ఇప్పుడు నరేంద్ర మోదీ పాలనలో మన దేశంతో సాన్నిహిత్యం పెంచుకోవడానికి ప్రపంచ దేశాలు పోటీ పడుతున్నాయన్నారు. మోదీ పరిపాలన విధానం, ప్రవేశపెట్టిన పథకాల వల్ల అన్ని వర్గాలకు సమ భాగంగా అందుతున్నాయని వివరించారు. కార్యకర్తలు అందరూ కేంద్ర ప్రభుత్వం కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో రాబోయే ఎన్నికలలో అన్ని వార్డుల్లో బీజేపీ కౌన్సిలర్లు గెలిచే విధంగా ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగా చక్రధర్ రెడ్డి, ఠాకూరు రాంసింగ్, అల్లంకి ప్రకాష్, మౌటం నర్సింగ్, శివంగారి సతీష్, బెజ్జంకి దిలీప్ కుమార్, పర్శ సమ్మయ్య వెల్లంపల్లి శ్రీనివాస్ తుడి రవి, మంతెన కృష్ణ, గణవేన రాజేందర్, మోర మనోహర్, పాల్గొన్నారు

సైబర్ నేరస్థుల చేతిలో మోసపోయిన మహిళ

చందుర్తి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సైబర నేరస్థుల చేతిలో ఓ మహిళ మోస పోయిన సంఘటన చందుర్తి మండలం సనుగులలో ఈనెల 9న జరుగగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామ స్థుల కథనం ప్రకారం.. లక్ష్మి అనే మహిళ కుమారుడు మనోజ్ ఆరుమాసాల క్రితం దుబాయ్ వెళ్లాడు. ఈనెల 9న గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు ఫోన్‌చేసి మీ కుమారుడి ప్రాణం బాగాలేదని, ఆసు పత్రికి తీసుకువచ్చామని, ఈ ఫోన్ నంబ ర్‌కు రూ.5వేలు పంపించాలని చెప్పగా ఆమె డబ్బులు పంపింది. కొంత సమయం తర్వాత ఆమె కొడుకుకు ఫోన్‌చేసి ఆరోగ్యం ఎలా ఉందని ఆరాతీసి జరిగిన విషయాన్ని తెలిపింది. దీంతో తాను మోసపోయానని గ్రహించి ఆమె చందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

కల్వలలో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ దాడులు

- 200లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

శంకరపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కల్వల గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడిచేసి 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, 200లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో మండలంలోని కల్వల గ్రామంలో దాడులు చేసి శివరాత్రి మల్లయ్య అనేవ్యక్తి వద్ద 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీకి ఉపయోగించే 200లీటర్ల బెల్లం పానకం, తయారీ సామాగ్రిని ధ్వంసం చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కుమార్, కమలాకర్, సంతోష్, సాయి, కాసిండి, కమలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో రాణిస్తున్న క్రీడాకారులు

- సుల్తానాబాద్‌లో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రం
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో ప్రతిభ
- ఐదేళ్ల పాటు సెంటర్ కొనసాగింపు
- కోచ్ ద్వారా రోజూ శిక్షణ


ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థిని విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ పరిధిలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సుల్తానాబాద్‌లో ఖేలో ఇండియా సెంటర్‌ను మంజూరు చేశారు. ఖోఖో క్రీడలో శిక్షణ ఇవ్వడానికి ఈ సెంటర్ మంజూరు చేశారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలలో రాణిస్తూ పలు పతకాలు సాధిస్తున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో ఈ సెంటర్‌ను ప్రారంభించారు. మొదట సెంటర్ మార్కండయ కాలనీలోని పెరికిగిద్దె ఆంజనేయ స్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న మినీ స్టేడియంలో నిర్వహించారు. అయితే అక్కడ సౌకర్యాలు లేకపోవడం, తగిన భద్రత కరువ వడంతో ఈ కేంద్రాన్ని ఇటీవల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మార్చారు. క్రీడలలో ఆసక్తి ఉన్న వారు ఈ కేంద్రానికి వచ్చి శిక్షణ పొందుతున్నారు. పలువురు విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో పాల్గొంటూ ఖేలో ఇండియా సెంటర్‌లో శిక్షణ పొందు తున్నారు. రోజూ సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు శిక్షణ కొనసాగు తుంది. అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు, బంగారు పతాక గ్రహీత గెల్లు మధూకర్‌ను కోచ్‌గా నియమించి ఖోఖోలో శిక్షణ ఇస్తున్నారు.

● పలు రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలలో....


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వైష్ణవి

ఖోఖోలో శిక్షణ పొందిన క్రీడాకారులు పలువురు రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని పలు పతకాలు సాధించారు. జి వైష్ణవి అనే విద్యార్థిని కేరళలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని పతకం సాధించింది. అలాగే సీఎం కప్ పోటీలు, స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలలో కూకట్ల అఖిల్, నాంపల్లి సిద్దార్థ, శ్రీగిరి అభిరనందన్, గొట్టం చరణ్ అజయ్, మనోజ్ మహాలక్ష్మి శృతి తదితరులు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో మరో ఇరవై మంది ఆడారు. మహాలక్ష్మి, శ్రీగిరి అభిర నందన్ సీఎం కప్ పోటీలలో బహుమతులు సాధించారు.


జాగింగ్ చేస్తున్న క్రీడాకారులు

రోజూ 60 నుంచి 70 మందికి శిక్షణ

గెల్లు మధూకర్, ఖేలో ఇండియా సెంటర్ కోచ్



సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా సెంటర్ ద్వారా రోజు 60 నుంచి 70 మంది బాల బాలికలకు ఖోఖో లో శిక్షణ ఇస్తున్నాం. ఖోఖో ద్వారా నేను అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని పతకాలు సాధించాను. పిల్లలకు కూడా తగిన తర్ఫీదు ఇస్తూ వారిని కూడా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తాను.

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలి

- సురేష్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి



గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం సుల్తానాబాద్ లో ఖేలో ఇండియా సెంటర్‌ను మంజూరు చేసింది. ఇందులో ఆసక్తి ఉన్న క్రీడాకారులకు ఖోఖోలో శిక్షణ ఇస్తాం. ప్రతీ జిల్లాకు ఒక సెంటర్ మంజూరు కాగా పెద్దపల్లికి ఖోఖో సెంటర్ మంజూరైంది. ఈ సెంటర్‌ను సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేశాం. ఇది ఐదేళ్ల పాటు కొనసాగుతుంది. ఇందులో శిక్షణ పొందిన పిల్లలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో రాణించి బంగారు పతకాలు సాధించే విధంగా శిక్షణ ఇస్తున్నాం.

సెంటర్ ఏర్పాటుతో ఖోఖోకు పూర్వ వైభవం

పారుపల్లి వెంకట ఉమాపతి, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి



సుల్తానాబాద్ లో స్పోర్ట్స్ అథారిటీ వారు ఖేలో ఇండియా సెంటర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఖోఖో క్రీడకు పూర్వ వైభవం చేకూరింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఖోఖో క్రీడకు సుల్తానాబాద్ నిలయంగా ఉండేది. సెంటర్‌ను సుల్తానాబాద్ లో ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత క్రీడాకారులకు ఎంతో వెసలుబాటుగా ఉంటుంది. వారిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభ ఈ సెంటర్ ద్వారా వెలుగులోకి వచ్చి జాతీయ అంతర్జాతీయ పోటీలలో పాల్గొనే అవకాశాలు వస్తాయి.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హత్యచేసిన కేసులో ఒకరికి జీవిత ఖైదుతోపాటు ఐదువేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ శుక్రవారం తీర్పు నిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాలోని మెట్‌పెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరెపేటకు చెందిన షేక్‌అహ్మద్ మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 2023 ఫిబ్రవరి18వ తేదీన పనికి వెళ్లకుండా స్నేహితులతో కలిసి అహ్మద్ మద్యం సేవించాడు. మద్యం మత్తులో చెటిపెల్లి సురేష్ అనే వ్యక్తికి అహ్మద్‌కు మధ్య సిమ్ కార్డు విషయంలో గొడవ జరిగింది. దీంతో సురేష్ తన జేబులో ఉన్న నేల్‌కట్టర్‌తో అహ్మద్ కడు పులో పొడిచాడు. తీవ్ర గాయాలైన అహ్మ ద్‌ను కుటుంబసభ్యులు మెట్‌పెల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్సకోసం తర లించారు. మెరుగైన వైద్యం కోసం నిజా మాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ అహ్మద్‌మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శ్యాంరాజ్ కేసు నమోదు చేయగా సీఐ లక్ష్మీనారాయణ కేసుదర్యాప్తు చేసి నింది తుడైన రాయికల్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన సురేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టుడ్యూటీ అధికారులు రంజిత్, కిరణ్ కుమార్ సరైనసాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లి కార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి సురేష్‌కు జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడ డంలో కృషిచేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

పుస్తెల తాడు చోరీ

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో గురువారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న మొగిలి రాజవ్వ(70) మెడలోని రెండు తులాల పుస్తెల తాడును ఓ ఆగంతకుడు ఎత్తుకెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు దొంగను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఎంజేపీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జాయింట్ సెక్రెటరీ


కళాశాల సిబ్బంది, విద్యార్థినులతో మాట్లాడుతున్న శ్యాం ప్రసాద్‌లాల్

తిమ్మాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని మహాత్మా జ్యోతిబాఫూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను గురుకుల పాఠశాలల జాయింట్ సెక్రెటరీ శ్యాంప్రసాద్ లాల్ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికల గురు కులంతోపాటు ఇంటర్ కళాశాల, వ్యవసాయకళాశాల విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. రికార్డులను పరిశీలించారు. మెనూప్రకారం భోజనం పెడుతున్నారా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వస్తువుల నాణ్యత, కిచెన్‌ను తనిఖీ చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎవరికి భయపడవద్దని విద్యార్థినులకు అభయం ఇచ్చారు. ఆర్సీవో అంజలి, ప్రిన్సిపాల్ సరిత, అధ్యాపకులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

కట్నం కోసం వేధించిన కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం కట్టుకున్న ఇల్లాలును వేధించిన కేసులో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాల గ్రామానికి చెందిన భర్త పడగ తిరుపతికి యేడాది పాటు జైలు శిక్షతో పాటు రూ.వేయి జరిమానాను విధిస్తూ సిరిసిల్ల అదనపు ప్రథమ శ్రేణి న్యాయ మూర్తి సృజన తీర్పు చెప్పారని ఎస్‌ఐ రమాకాంత్ శుక్రవారం పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలోని అడిగె మాధవికి చిన్నబోనాల గ్రామానికి చెందిన పడగ తిరుపతితో 2007లో వివాహమైంది. ఆ సమ యంలో మాధవి పుట్టింటి వారు రూ. 4లక్షల నగ దుతో పాటు 5 తులాల బంగారు,30 తులాల వెండి ఆభరణాలు ఇతర లాంచనాలతో పెళ్లి జరిపించారు. ఐదేళ్ల పాటు అన్యున్యంగా దంపతులు కలిపి జీవిం చారు. అనంతరం భర్త తిరుపతి తన తల్లిదండ్రుల ప్రోద్భలంతో అదనపు కట్నం కోసం వేధించేవాడు. ఈ క్రమంలో భరించలేక మాధవి తన పుట్టింటికి చేరుకుంది. మొదటి భార్య ఉండగానే తిరుపతి మరో యువతిని వివాహం చేసుకున్నాడు. తనను మోసం చేసి రెండో పెళ్లి చేసుకున్నాడని పేర్కొంటూ భర్త, అతని కుటుంబ సభ్యులపై మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేప ట్టారు. అప్పటి ఎస్‌ఐ నరేశ్ న్యాయస్థానంలో చార్జీ షీటు దాఖలు చేశారు. సీఎంఎస్ ఎస్‌ఐ రవీందర్‌నా యుడు, ఆర్ఎస్‌ఐ శ్రవణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టే బుల్ శంకర్‌లు సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సతీష్‌కుమార్ వాదించారు. పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి సృజన నిందితుడు తిరుపతికి యేడాది పాటు జైలు శిక్షతో పాటు రూ.వేయి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడిం చారని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అజయ్ (ఫైల్)

కథలాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వరదకాలువ శివా రులో పల్లికొండ అజయ్(20) అనే యువ కుడు శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కథలాపూర్ నుంచి భూషణరావుపేటకు ద్విచక్రవాహ నంపై అజయ్‌వెళ్తున్న క్రమంలో ప్రమా దం జరిగిందని పోలీసులు తెలిపారు. ద్విచక్రవాహనం కొంతదూరం పడి ఉండ డంతో ఎవరైనా ఎదురుగా వచ్చి అజయ్‌ను ఢీకొట్టడంతో మృతి చెంది ఉంటాడా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పోలీ సులు పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అజయ్ కోరుట్లలో ఓప్రైవేట్‌కళాశాలలో డిగ్రీసెకండ్ ఇయర్ చదువు తున్నాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించారు.

అత్యాచారయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

ఎలిగేడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండలం రాముల పల్లి గ్రామంలో ఐదేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన కేసులో యువకుడిని అరెస్ట్ చేసినట్లు జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. అదేగ్రామానికి చెందిన తీట్లనవదీప్(22) అత్యాచారయత్నా నికి పాల్పడినట్లు పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం సమయంలో అత్యాచారయత్నం చేశాడని బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఫోక్సోచట్టం కింద కేసునమోదు చేశామన్నారు. శుక్రవారం నిందితు డిని సుల్తానాబాద్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వీణవంక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పొడపత్రపు హరీష్(32) మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది మార్చి 16న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు

మంథనిరూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలపై మంథని పోలీసుస్టేషన్‌లో శని వారం ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసునమోదైంది. గోపాల్ పూర్‌లో వీవోఏగా పనిచేస్తున్న గొరిగె జయసుధను విధుల నుంచి తొలగించిన విషయంలో పీడీ ఆదేశాల మేరకుగ్రామంలో విచారణ జరిగింది. ఆ సమయంలో ఆమెను, అదే గ్రామానికి చెందిన ఎరుకల సమ్మక్కను వీవో అధ్యక్షురాలు లక్కసరిత, దాసరిబుజమ్మ, దాసరి రమాదేవీలు కులంపేరుతో దూషించినట్లు బాధితు రాలు జయసుధ మంథని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగాముగ్గురిపై అట్రాసిటీ కేసునమోదుచేసి విచారణ జరుపుతున్నారు.

ఉద్యోగం పేరుతో మోసం.. కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): విదేశాలలో ఉద్యోగంపేరుతో యువకుడిని మోసం చేసిన వ్యక్తిపై కరీంనగర్ రెండో ఠాణాలో పోలీసులు కేసు నమోదు చేశారు. రెండో ఠాణా సీఐ సృజన్‌రెడ్డి వివరాల ప్రకారం... కరీంనగర్ భగత్‌నగర్‌కు చెందిన కె.మెహర్‌తేజ విదేశాల్లో ఉద్యోగంకోసం ప్రయత్నిస్తు న్నాడు. అతడి స్నేహితుడి ద్వారా కిరణ్ అనే వ్యక్తిని పరిచయ మయ్యాడు. బ్యాంకాక్‌లో ఉద్యోగం కోసం కిరణ్‌కు రూ.30 వేలు ఇవ్వాలని ఒప్పందం కుదిరింది. అనంతరం బ్యాంకాక్ చేరుకున్న మెహర్‌తేజనుంచి కంపెనీవారు పాస్‌పోర్ట్ తీసుకొని క్రిప్టోకరె న్సీలో ఉద్యోగం ఇచ్చారు. ఆన్‌లైన్‌లో ప్రజలను మోసం చేయడం నచ్చని మోహర్‌తేజ అక్కడి భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించి ఇండియాకు వచ్చాడు. రావడంతోనే హైదరాబాద్‌లోని సైబర్ క్రైం విభాగాన్ని ఆశ్రయించాడు.

ఈ ఉపాధ్యాయుడు మాకొద్దు

- మైలారంలో విద్యార్థులు, గ్రామస్థుల ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు

గన్నేరువరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): క్రమ శిక్షణతోపాటు విద్యా బుద్దులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు విచక్షణ మరిచి బాధ్యతా రాహిత్యంగా చితకబాదు తున్నాడని, పాఠశాల హెచ్‌ఎంతోపాటు పాఠ శాల సిబ్బందిని భయ భ్రాంతులకు గురిచేస్తున్న ఉపాధ్యాయుడిని పాఠ శాలనుంచి పంపించేయా లని విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు గ్రామ స్థులు పాఠశాల ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లి దండ్రులు మాట్లాడుతూ మైలారంలోని మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రాంరాజయ్య పాఠాలు చెప్పకుండా తరగతి గదిలో నిద్రపోతుంటా రని, విద్యార్థులను విచక్షణారహితంగా చితకబాదుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన సిబ్బందిని, అటెండర్‌ను ప్రధానోపాధ్యాయు డిని సైతం బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. ఈ సందర్భంగా ఉపాధ్యా యుడు రాంరాజయ్య మీడియాతో మాట్లా డుతూ పాఠశాలలోని సమస్యలపై ప్రశ్నించి నందుకు తనపై లేనిపోని ఆరోపణలు చేసి తన విధులకు ఆటంకం కలిగిస్తున్నారని అన్నారు.

ఇంజనీర్లు జ్ఞాన సమాజాన్ని నిర్మించాలి


మాట్లాడుతున్న ఎస్‌యూ ఆర్ట్స్ అండ్‌సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూరెపల్లి సుజాత

కొడిమ్యాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లు గౌరవం కలిగిన జ్ఞాన సమాజాన్ని నిర్మించాలని శాతవాహన యూనివర్సిటీ ఆర్ట్స్అండ్‌సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌సూరెపల్లి సుజాత అన్నారు. శుక్ర వారం రాత్రి మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుజాత మాట్లాడుతూ ఇంజనీర్లలో సృజనాత్మకత ఉండాలన్నారు. విద్యతో సంపాదించుకున్న జ్ఞానంతో విజయాలను సాధించి ఉన్నతశిఖరాలను అధిరో హించాలన్నారు. అంతకుముందు జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి ప్రభాకర్ కళాశాల వార్షిక ప్రగతినివేదిక చదివివినిపించారు. అనంతరం విద్యార్థులుచేసిన నృత్యాలుఆకట్టుకున్నాయి. కార్యక్ర మంలో వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

శోభాయమానంగా రాములోరి రథోత్సవం

- ఉత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెగడపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంచర్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం రాములోరి రథోత్స వాన్ని శోభాయమానంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆరు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల చివరి రోజైన శుక్రవారం ముందుగా హోమం కార్యక్రమం నిర్వహించి సీతారామ చంద్రస్వాముల ఉత్సవవిగ్రహాలను అందంగా అలంకరించిన రథం పై ఉంచి ఆలయం చుట్టూ జైశ్రీరాం నినాదాలతో హనుమాన్ దీక్షా పరులు, భక్తులు వేడుకలను నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొనేం దుకు ప్రభుత్వవిప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్ర మాలలో ఆలయకమిటీచైర్మన్ బండివెంకన్న, ప్రధాన కార్యదర్శిమంత్రి హరగోపాల్, సింగిల్‌విండోచైర్మన్ మంత్రి వేణుగోపాల్, మైత్రిగ్రూప్ చైర్మన్ కొత్తజైపాల్‌రెడ్డి, మండలనాయకులు రాములుగౌడ్, అమిరిశెట్టి మల్లారెడ్డి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మీరాజం, మల్లేశం, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొడుకులు కాదు.. కర్కోటకులు

- ముత్తారంలో తల్లిపై అత్యాచారయత్నం
- ప్రతిగా రోకలిబండతో దాడి.. కొడుకు మృతి
- ఎల్లారెడ్డిపేటలో తండ్రిని హతమార్చిన కొడుకు

కుటుంబ బంధాలు మసకబారుతున్నాయి. కన్న కొడుకులు కర్కోటకులుగా మారారు. క్షణికావేశంలో ఏం చేస్తున్నామో తెలియని పరిస్థితుల్లో అకృత్యాలకు పాల్పడ్డారు. మద్యం మత్తులో ఓ కొడుకు తల్లిపై అత్యాచారయత్నానికి పాల్పడగా ప్రతిఘటించి దాడి చేయడంతో మృతి చెందాడు. ఏ పని చేయకుండా తిరగవద్దని మందలించిన కన్నతండ్రినే కడతేర్చాడు ఓ కొడుకు.

ముత్తారం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సభ్యసమాజం తలదించుకునేలా మద్యం మత్తులో కుమారుడు తల్లిపై అత్యాచారయత్నానికి పాల్ప డ్డాడు. ఈ ఘటనలో ఆమె ప్రతిఘటించి దగ్గర లోనే ఉన్న రోకలిబండతో దాడి చేయగా తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని ఆసుపత్రికి తర లించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీక రించారు. గురువారం రాత్రి జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలానికి చెందిన యువకుడు (33) కొంతకాలంగా తాగుడుకు బాని సయ్యాడు. దీంతో అతడి భార్య విడాకులు తీసు కొంది. అప్పటి నుంచి అతిగా మద్యం సేవిస్తున్నాడు. మద్యానికి డబ్బుల కోసం తల్లిదం డ్రులను వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో గురు వారం రాత్రి అతిగా మద్యం తాగి ఇంటికి వచ్చా డు. పడుకొని ఉన్న తల్లి వద్దకు వెళ్లి అత్యాచార యత్నం చేశాడు.. ఖంగుతిన్న ఆమె కొడుకును నెట్టివేసి దగ్గరలో ఉన్న రోకలి బండతో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి.

అనంతరం తండ్రితోపాటు స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపతి నరేష్ తెలిపారు.


కొడుకు చేతిలో హతమైన కనకయ్య

ఎల్లారెడ్డిపేట : పని చేయకుండా తిరగవద్దని మందలించిన కన్నతం డ్రినే కడతేర్చాడు ఆ కొడుకు. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీ సుల కథనం మేరకు.. గ్రామంలోని కుంచెం కనక య్య(50) కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఒక్కాగానొక్క కొడుకు పర్శరా ములు ఎలాంటి పనులు చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. ఈక్రమంలో తండ్రి కనకయ్య కొడుకును మందలించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహించిన కొడుకు పర్శరాములు కర్రతో తండ్రిపై దాడి చేశాడు. దాంతో కనకయ్య స్పృహ తప్పి కింద పడిపోయాడు. కుటుంబ స భ్యులు 108లో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలిం చగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారిం చారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఐ రమాకాంత్ ఘట న స్థలానికి చేరుకుని పరిశీలించారు. కొడుకు పర్శ రాములు పరారీలో ఉన్నాడు. మృతుడికి భార్య దేవవ్వ, ఇద్దరు కూతుళ్లు సుమలత, మౌనికలు ఉన్నారు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదు మేర కు పోలీసులు కేసు నమోదు చేశారు.

చురుగ్గా కొనసాగుతున్న మల్కపేట కాలువ మరమ్మతు పనులు

● కుడి కాలువ ద్వారా నీటి విడుదలకు ఏర్పాట్లు



పల్లిమక్త- సుద్దాల గ్రామాల మధ్య వేస్తున్న పైప్‌లైన్

కోనరావుపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మల్కపేట కాళేశ్వరం ప్రాజెక్టుప్యాకేజీ9లో మల్కపేట నుంచి మారుపాక గ్రామంవరకు గల మల్కపేట రిజర్వాయర్ కుడికాలువ మరమ్మతు పనులు రాష్ట్రప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ ఆదేశాల మేరకు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుత నీటి కరువును దృష్టిలో ఉంచుకొని సాగు, తాగు నీటికి ఇబ్బందులు రాకుండా కుడికాలువలోకి నీటినివిడుదల చేయడానికి అధికారులు పనులు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రామన్నపేట, సుద్దాల మధ్యలోగల బ్రిడ్జిల కింద మట్టిని తొలగించి మధ్యలో కాలువపై పైపులువేశారు. నాగారం, పల్లిమక్తగ్రామాల మధ్యలో ప్రధాన రహదారిపై పైపులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేస్తూ, కాలువలో వివిధచోట్ల చేరిన పూడిక తొలగిస్తున్నారు.

క్రీడల్లో సత్తాచాటిన గురుకుల కళాశాల విద్యార్థినులు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):శాతవాహన యనివర్సిటీపరిధిలో సౌత్ జోన్ స్పోర్ట్స్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో కరీంనగర్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘీకసంక్షేమగురుకులకళాశాల విద్యార్థినులు సత్తాచాటారు. ఖోఖోపోటీల్లో నికిత, సింధు,సుష్మ,అశ్రిత,హిమజరెండో స్థానంలో నిలిచారు. సౌత్‌జోన్‌పోటీల్లో అలగప్ప యునివర్సిటీ తమిళనాడులో నిర్వహించిన కబడ్డీలోఇస్రా,సుష్మిత,జెప్పిరావు యూనివర్సిటీ చెన్నైలో నిర్వహించిన వాలీబాల్‌లో కావ్య శ్రీ, గీతం యూనివర్సిటీ నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌లో చాందిని, శివాని, కె నందిని ప్రతిభ కనబరిచారు. కరీంనగర్ అసోసియేషన్‌అథ్లెటిక్‌స్టేట్‌విభాగంలో హైదరాబాద్‌లో అక్షర, కరీంనగర్ అసోసియేషన్ ఫుట్‌బాల్ స్టేట్‌విభాగం నిజామాబాద్‌లో శ్రీహర్షిని, నవదిత, తేజస్వి, రచన, పుష్పలత, ఇష్ఠా, కావ్య, అంజలి, రాజమణి, నికిత, సత్య, శ్రీజ, కరీంనగర్ అసోసియేషన్ హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయిపోటీల్లో రాజమణి పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాలఆవరణలో ప్రిన్సిపాల్ మాలతి, వైస్ ప్రిన్సిపాల్‌సమత అభినందించారు.

'పండంటి' ఆరోగ్యం



● ఎండ వేడికి పండ్లతో చెక్
● పొంచి ఉన్న విషంపై జాగ్రత్త
● రసాయనాల కారణంగా దీర్ఘకాలంలో ప్రమాదం
● వేసవిలో హాయినిచ్చే పండ్లలో ఉపయోగాలు ఎన్నో

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సూర్యుడు సుర్రుమంటున్నాడు.. వేడి, ఉక్కపోతలతో ప్రజలు అబ్బో ఎండలు అంటూ గడప దాటడానికి భయపడుతున్నారు. ఎండ తీవ్రతతో వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడుతారు. వీటికి పండ్లు ఉపశమనాన్ని ఇస్తాయి. శరీరంలో ఉష్ణోగ్రతలు పెరగకుండా సమతుల్యం చేయడానికి పండ్లు ఎంతో ఉపయోగపడుతాయి. వేసవిలో ఎక్కువగా నీరు చెమట రూపంలో వెళుతుంది. దీని వల్ల లవణాలు కోల్పోయి నీరసపడుతాం. ఈ పరిస్థితుల్లో ఎక్కువగా పండ్లు తీసుకోవడం మంచిదని వైద్య నిపుణులు చెపుతున్నారు. వేడినుంచి ఉపశమనంగా ఆరోగ్యానిచ్చేవి పండ్లు. ఆపిల్ తింటే డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదంటారు. జీర్ణశక్తికి అరటి ఉపయోగపడితే గ్యాస్ సమస్యకు బొప్పాయి ఉపయోగపడుతుంది. చల్లదనంతో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు ఇచ్చే పండ్లలోకి విషం చేరుతోంది. నగరాల్లో పండ్లవ్యాపారం వేసవిలో ఎక్కువగా ఉంటుంది. కానీ వ్యాపారులు రసాయనాలను పండ్లపై చిమ్మి ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఆహార భద్రత అధికారులు తనిఖీలు చేస్తున్నా ఆగడం లేదు.

● రసాయనాలు ఎందుకు..?

పండ్లపై రసాయనాలను స్ప్రే చేయడం వల్ల వేగంగా పండుతాయి. ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ప్రధానంగా మామిడి, ఆపిల్, అరటి, సపోట, దానిమ్మ, జామ, బొప్పాయి, ఆరెంజ్‌లపై వీటిని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కాల్షియం కార్బైడ్.. ఇది పౌడర్ రూ పంలో ఉంటుంది. పౌడర్ ప్యాకెట్లను పండ్ల మధ్యలో పెట్టి దానిపై టార్పాలిన్ కప్పి నీళ్లు చల్లుతారు. ఈ పౌడర్ నుంచి ఎసిటెలిన్ గ్యాస్ ద్వారా పండ్లు సరిగా పండకపోయినా అందంగా కనిపిస్తాయి. అరటి పండ్లపై ఎథోపాన్ రసాయనాన్ని చల్లుతారు. చెట్టు నుంచి గెలను తీసి స్ప్రే చేయడం లేదా నీటిలో ముంచడం వల్ల అరటికాయ పక్వానికి వస్తుంది. ఆపిల్ పండ్లపై పారాపిన్ అనే మైనాన్ని వినియోగిస్తారు. దీనిని మండించి వచ్చే ఆవిరిని ఆపిల్ పండ్లకు పడుతారు. దీని వల్ల పండ్లలోని నీటి శాతం ఉండిపోతుంది.



● వీటివల్ల జరిగే నష్టాలు..

రసాయనాలు ఉపయోగించి పండ్లను పక్వానికి తేవడం వల్ల మనిషి అవయవాలపై ప్రభావం చూపుతుంది. కడుపులో అల్సర్లు, నాడీ సంబంధిత వ్యాధులు, చర్మ వ్యాధులు, చూపు మందగించడం, క్యాన్సర్ వంటివి వస్తాయి. గర్భిణులు తినడం వల్ల గర్భాశయ వ్యాధులు, పిల్లలో జన్యుపరమైన లోపాలు వస్తా యి.

● జాగ్రత్తలు తీసుకోవాలి..

కృత్రిమంగా పండించిన పండ్లు ఎంతో ఆకర్షణీయంగా ఉండి అన్నీ ఒకే రంగులో కనిపిస్తాయి. పండును కోస్తే లోపల సరిగా పండకపోవడం, రుచిగా లేకపోవడం, పండిన వాసన రాకపోవడం మనం గమనించవచ్చు. ముఖ్యంగా వీలైనంతవరకు ప్రతి పండు తొక్క తీసి తినడం మంచిది. ఆపిల్‌కు మైనం పూత ఉన్నట్లు అనుమానం కలిగితే మూడు నిముషాలు వెనిగర్ సొల్యూషన్‌లో ఉంచాలి. నీటితో శుభ్రం చేయాలి. ద్రాక్ష, బొప్పాయి పండ్లను ఉప్పు నీటితో కడిగి తినాలి. మామిడి పండును వేగంగా ప్రవహించే నీటిలో మూడు నిముషాలు ఉంచి తినాలి.

● వేడి, నీరసాన్ని తగ్గించే ద్రాక్ష..



పండ్లలో ద్రాక్ష పండ్లు ఎంతో ముఖ్యమైనవి. ఇందులో విటమిన్లు, కాల్షియం, సోడియం, పొటాషియంతోపాటు నీరు 88.5శాతం, పాస్పరస్ 0.02, పిండి పదార్థాలు 10.2, ఇనుము 0.4, మాంసకృతులు 0.6, విటామిన్ ఎ 151ఐయు, విటామిన్ బి2 10.3, కాల్షియం 0.03, విటామిన్ సి 10మీల్లీగ్రాములు ఉంటాయి. ద్రాక్ష మలబద్దకాన్ని, పైల్స్‌ను నివారిస్తుంది. కాలేయం చురుకుదానాన్ని పెంచుతుంది. మూత్ర సంబంధ బాధలను తగ్గిస్తుంది. రక్తశుద్ధితోపాటు వేడి నీరసాన్ని తగ్గిస్తుంది. క్యాన్సర్ నివారణకు ఉపయోగపడుతుంది. బరువు తగ్గడానికి కూడా దోహదపడుతుంది.

● సాటిలేని ఆపిల్..



ఆపిల్ పండు వగరు, తియ్యగా, పుల్లగా ఉంటుంది. పండులో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. నీరు 85.4శాతం, కాల్షియం 0.01, పిడి పదార్థాలు 9.5, పాస్పరస్ 0.2, మాంస కృతులు 0.4, ఇనుము 1.7, విటామిన్ ఎ 40ఐయు ఉంటుంది. ఆపిల్‌లో ఉండే ఇనుము, భాస్వరం మెదడుకు, శారీరానికి బలాన్ని ఇస్తుంది. పెక్టివ్ సూక్ష్మజీవులను నశింపజేస్తుంది. శరీరం నీరసంగా మారితే ఆపిల్ రసం వెంటనే బలాన్ని ఇస్తుంది. ఆలోచన శక్తిని పెంచుతుంది. మెదడుకు ఎంతో ఉపయోగ పడుతుంది. పొట్టలో గ్యాస్, గౌట్, అర్థ్రైటిస్ వ్యాధులకు ఎంతో మంచిది.

● పండ్లలో రాజు మామిడి..



పండ్లలో మామిడి రాజు వంటిది. బాగా పండిన మామిడిలో పిండి పదార్థాలు 12 గ్రామాలు, కాల్షియం మి.17, మాంసం కృతులు 0.6, పాస్పరస్ 20, కొవ్వు పదార్థాలు 0.1, ఇనుము 0.8, విటామిన్ ఎ 4,800 నుంచి 22,550ఐయు, పోటాషియం 250, విటామిన్ బి1 42,755, సోడియం 7, విటామిన్ బి2 50, నియాసిస్ 0.3, విటామిన్ సి 150గ్రాములు ఉంటాయి. వీటితోపాటు సిట్రిక్ యాసిడ్, గాలక్టోజ్‌పాంటోజ్ పిప్పి పదార్థాలు ఉంటాయి. దీని వల్ల మలబద్ధకం నివారణతోపాటు కాలేయం, పేగులు, చురుకుదనంగా పనిచేస్తాయి. మామిడికాయ పచ్చళ్లు ఎంతో ఉపయోగపడుతాయి.

● రక్తహీనతకు దానిమ్మ..



దానిమ్మ పండు రెండు రెకాలుగా ఉంటుంది. తియ్యటివి, పుల్లటివి. ఈ పండు తేలిగ్గా జీర్ణమవుతుంది. పండులో నీరు 78శాతం విటమిన్ సి 16ఎంజి, పిండి పదార్థాలు 14.5, కాల్షియం 0.01, మాంస కృతులు 1.7, పాస్పరస్ 0.7, ఇనుము 0.03 ఎంజి, విటామిన్ బి 10ఎంజి ఉంటుంది. గుండెపోటును, మల బద్ధకాన్ని నివారిస్తుంది. రక్తహీనతకు ఉపయోగపడుతుంది. జ్వరం వస్తే దానిమ్మ పండు ఎంతో ఉపయోగపడుతుంది.

● దాహార్తిని తీర్చే వాటర్‌మిలన్..



వేసవి రాగానే ఎక్కడ చూసిన కనిపించేది వాటర్ మిలన్(పుచ్చకాయ). ఎక్కువగా నీటితో ఉండే వాటర్ మిలన్ వేసవి దాహాన్ని తీర్చుతుంది. నీరు అధిక శాతం ఉండడంతో పాటు కాల్షియం, ఇనుము, సల్ఫర్, కాపర్‌లు ఎక్కువగా ఉంటాయి. రక్తహీనతను తగ్గించడంతో పాటు మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. కడుపులో మంటను, మూత్ర సంబంధ వ్యాధులకు మంచిది.

● గ్యాస్‌ను దూరం చేసే పైనాపిల్..



పొట్టలో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌ను దూరం చేయడంతోపాటు గుండె బలాన్ని పెంచేలా, మూత్రం సాఫీగా ఉండేలా పైనాపిల్ చూస్తుంది. పేగుల్లోని క్రిములను నాశనం చేస్తుంది. పైనాపిల్‌లో నీరు 86.5శాతం ఉంటే విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ బి, చక్కర, ఇనుము, మాంస కృతులు ఉంటాయి.

● వేడి తగ్గించే తర్బూజా..



వేసవిలో చల్లదాన్ని తర్బూజ అందిస్తుంది. వేసవిలో మాత్రమే ఎక్కువగా దొరికే అందరికి అందుబాటులో ఉంటుంది. తర్బూజాలో నీరు 95.9శాతం ఉంటే కాల్షియం, పిండి పదార్థాలు, పాస్పరస్, మాంస కృతులు, ఇనుము, సోడియంలు ఉంటాయి. ఒంట్లో వేడిని తీసి వేయడంతోపాటు మూత్ర సంబంధ వ్యాదులను తగ్గిస్తుంది. చర్మ వ్యాధుల నివారణకు ఉపయోగ పడుతుంది.

● అజీర్తిని తగ్గించే బత్తాయి..



వేసవిలో అజీర్తికి బత్తాయి ఎంతో ఉపయోగ పడుతుంది. వీటిలో విటామిన్ సి, ఇనుము, పోటాషియం, కాల్షియం, పాస్పరస్‌లు పొట్ట బాగాలను నివారిస్తుంది. ఆకలిని వృద్ధి చేస్తుంది.

● వేసవి దాహానికి కొబ్బరి బొండం..



వేసవి వేడిని తగ్గించడానికి కొబ్బరి బోండం ఎంతో ఉపయోగపడుతుంది. వేసవిలో ఎక్కువగా దొరికే కొబ్బరి బొండాలు చక్కర శాతం ఎక్కువగా ఉండడం వల్ల శరీరానికి శక్తినిస్తుంది. పిల్లలకు కూడా కొబ్బరి బొండాలు వేసవిలో ఆరోగ్యంగా ఉంచడానికి ఎంతో దోహద పడుతుంది.

● ఉష్ణోగ్రతను నియంత్రించే సపోటా..



శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరగకుండా సపోట పండ్లు నియంత్రిస్తుంది. సపోటలో ఉండే కరోటెన్ కంటికి రక్షణగా నిలుస్తుంది. గ్లూకోజ్, విటామిన్ సి, కాల్షియం, క్లోరిన్, పీచు పదార్థాలు అధికంగా ఉండే సపోటాతో నీరసం తొలగించి శక్తి నిస్తుంది.



కొండంతా.. కాషాయమయం

● హనుమాన్ చిన్న జయంత్యుత్సవాలు షురూ
● కొండగట్టుకు తరలివస్తున్న దీక్షాపరులు
● నేడు చిన్న హనుమాన్ జయంతి




కొండగట్టుకు వస్తున్న హనుమాన్ దీక్షాపరులు

మల్యాల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మూడు రోజుల పాటు జరిగే హనుమాన్ చిన్న జయంత్యుత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి దీక్షాపరులు కొండగట్టుకు తరలివస్తూ స్వామి వారిని దర్శించుకుని మాలవిరమణ చేస్తున్నారు. వేకువజామున వేలాదిగా భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. జయంతి కోసం భక్తులు, అంజన్న దీక్షాపరులు వాహనాలు, కాలి నడకన కొండగట్టుకు తరలి వస్తున్నారు. కాగ శనివారం చిన్న జయంతి కోసం శుక్రవారం సాయంత్రం నుంచి భక్తుల రద్దీ పెరిగింది. వేలాదిగా భక్తులు, దీక్షపరులు కొండకు తరలివస్తున్నారు. దీంతో కొండంతా కాషాయయంగా మారింది. కలెక్టర్ సత్యప్రసాద్ కొండపై అధికారులతో కలసి ఏర్పాట్లు, సౌకర్యాలు పరిశీలిస్తూ పలు సూచనలు చేశారు. జయంతి ఉత్సవాల ప్రత్యేక అధికారి, శ్రీనివాసరావు, ఈవో శ్రీకాంత్‌రావు, డిఎస్పీ రఘుచందర్, సీఐ నీలం రవి తదితరులు నిరంతరం కొండపైన పర్యవేక్షిస్తున్నారు.

నేడు హనుమాన్ చిన్న జయంతి

ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం హనుమాన్ చిన్న జయంతిని దేవస్థానం తరుపున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్తర భారతదేశంలో ప్రతియేటా చైత్ర పౌర్ణమి రోజున హనుమాన్ జయంతిని నిర్వహించనుండగా ఇక్కడ కూడా అదే రోజు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కాగా జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి అభిషేకం, పట్టువస్త్రలంకరణ అలంకారం చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా సాయంకాలం ఆలయ ఆవరణలో భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించారు.



కొండగట్టులో హనుమాన్ దీక్షాపరులు

● తండోపతండాలుగా భక్తులు

వివిధ ప్రాంతాల నుంచి తండోపతండాలుగా దీక్షాపరులు కొండగట్టుకు తరలివస్తుండడంతో కొండంతా కాషాయమయంగా మారింది. రామనామంతో అంజన్న సన్నిధి పులకిస్తోంది. అంజన్న దీక్షాపరులు హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారి సన్నిధిలో మాల విరమణ చేయడం ఆనవాయితీ. దీంతో మాల విరమణ కోసం కల్యాణకట్టలో దీక్షావిరమణ మండపం ఏర్పాటు చేశారు. ఇందులోనే భక్తులు మాల విరమణ చేస్తున్నారు. కొండగట్టుకు వస్తున్న భక్తుల వాహనాలకు జెఎన్‌టీయూ మార్గంలోని బొజ్జ పోతన వద్ద పార్కింగ్ ఏర్పాటు చేయగా అక్కడి నుంచి ఆలయంకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ఉచిత బస్ సౌకర్యం ఏర్పాటు చేసింది. కాగా కొండపైన ఉత్సవాల కోసం వచ్చిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సంఖ్యే అధికంగా కనిపిస్తుంది.



కొండగట్టులో కల్యాణ కట్ట వద్ద భక్తుల రద్దీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్

వైభవంగా ప్రారంభమైన రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు



వాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

సుల్తానాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం లోని నీరుకుళ్ల మానేరులో వెలసిన భూ,నీళాసమేత రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం స్వామి వారిని శేషవాహనం పై ఊరేగించారు. మంగళవాయిద్యాలు భక్త జనసందోహం మధ్యన భక్తిగీతాలు ఆలపిస్తుండగా భూనీళా సమేతుడైన రంగనాయకుల శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శేషవాహన సేవలు కొనసాగగా, శనివారం పొన్నసేవ, ఆదివారం గరుడవాహన సేవలు జరగనున్నాయి. సోమవారం డోషకథతోపాటు బండ్లు తిరిగే కార్యక్రమం వైభవంగా చేస్తారు. చుట్టు పక్క గ్రామాల రైతులు ఎడ్లబండ్లతో ఆలయం చుట్టూ తిరుగుతారు. మంగళవారం హంస వాహన సేవ, తెప్పోత్సవం, రాత్రి డోలోత్సవం ఉంటుంది. బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా రథోత్సవం ఈనెల 17న తెల్లవారుజామున ప్రారంభమువుతుంది.

రథోత్సవానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లిస్తారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకులు గోవర్ధన గిరి మనోహరాచార్యులు, ఆచార్య రాజ్‌కుమార్ తెలిపారు.

ఎస్‌యూ పీహెచ్‌డీ ప్రవేశఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

గణేశ్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవికుమార్ జాస్తి పీహెచ్డీ ప్రవేశ ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉమేష్ కుమార్ మాట్లాడుతూ నాలుగు ఫ్యాకల్టీ విభాగాల్లో ఫలితాలను విడుదల చేశామని, విశ్వవిద్యాలయంలో పరిశోధన మరింత ముందుకెళ్తుందని అన్నారు. ఇది విశ్వవిద్యాలయ అభివృద్ధికి అవసరమన్నారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్, సోషల్ సైన్స్‌డీన్ ఆచార్య సుజాత, ఓఎస్డీటు వీసీ హరికాంత్, అదనపుపరీక్షల నియంత్రణ అధికారి అబ్రారూల్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు స్వాధీనం

వెల్గటూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం సూరారం గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఉమాసాగర్, ఆర్ఐ రాజేశ్వరి తెలిపారు. సూరారంలో అక్రమ ఇసుక నిల్వ చేశారనే సమాచారం మేరకు వెల్గటూర్ పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులతో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సుమారు 8నుంచి 10ట్రిప్పుల ఇసుకను అక్రమంగా నిల్వ చేశారని నిర్ధారణ కావడంతో ఇసుకను పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

దుష్ప్రచారాన్ని నిలిపివేయాలి..

● నేరెళ్ల ఘటనపై ఎస్సీ కమిషన్‌ను తప్పు పడుతారా?
● చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

సిరిసిల్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో 2017లో ఇసుక లారీ ఢీకొని ఒకరు మృతిచెందగా, ఆసంఘటనలో దళితులు, ఇతరులపై జరిగిన వేధింపులపై ఎస్సీ కమిషన్ విచారణ జరిపింది. ఇటీవల కొంతమంది నేరెళ్ల ఘటనలో సోషల్ మీడియా వేదికగా జాతీయ ఎస్సీ కమిషన్‌ను బద్నాం చేస్తున్నట్లు సమాచారం అందుకున్న కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రామచందర్ అంశాన్ని తీవ్రంగా పరిగణించారు. దళితుల పక్షాన పనిచేసే కమిషన్‌ను నిందించడాన్ని ఆయన తప్పుబట్టారు. తక్షణమే దుష్ప్రచారాన్ని నిలిపివేయాలని కోరారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరేళ్ల ఘటనలో ఎస్సీ కమిషన్ జరిపిన విచారణతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశామని, బాధితులకు న్యాయం జరిగేలా బాధ్యులపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.

2017 జూలైలో రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల గ్రామంలో ఎస్సీ కమిషన్ పర్యటించి బహిరంగ విచారణ జరిపింది. ఆ విచారణలో భాగంగా ఎస్సీ కమిషన్ కరీంనగర్ జైలుకు వెళ్లి నేరేళ్ల బాధితులను కలిసి వారి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. కలెక్టర్, పోలీస్ అధికారులను విచారణ జరిపి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. అదే సంవత్సరం ఆగస్టు 7న అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మధ్యంతర నివేదికను పంపిస్తూ చర్యలు తీసుకోవాలని కమిషన్ ఆదేశించింది.

ఆన్‌లైన్ అవస్థలు
(5వ పేజీ తరువాయి)

రాజీవ్ యువ వికాసం ఆన్‌లైన్ సైట్‌లో సాంకేతిక సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

సెలవు రోజుల్లో దరఖాస్తులు స్వీకరిస్తాం

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను సెలవు రోజుల్లో స్వీకరిస్తామని ఎంపీడీవో శశికళ శుక్రవారం తెలిపారు. ఈనెల 12 నుంచి 14 వరకు మూడు రోజులు సెలవులు ఉన్న ప్పటికి మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు దారులు దరఖాస్తులను అందజేయాలని సూచించారు. కార్యాలయంలో సంబంధిత ఉద్యోగి ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు తీసుకుంటారన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఆయా కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ పథకాలకు ఈనెల 14 వరకు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని మండల పంచాయతీ అధికారి అనిల్‌రెడ్డి తెలిపారు. శని, ఆది, సోమవారాలు సెలవు దినాలు అయినప్పటికి మీసేవా కేంద్రాలు పనిచేస్తాయన్నారు. దరఖాస్తులను కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజీవ్ యువవికాసం కౌంటర్‌లో అందజేయాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

సుల్తానాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు అంగన్ వాడీ కేంద్రాలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతు ప్రతీ అంగన్ వాడీ సెంటర్‌లోని పిల్లలకు పౌష్టికాహార లోపం లేకుండా ఏడు నెలల చిన్నారి నుంచి మూడు సంవత్సరాల పిల్లల వరకు బాలామృతంతోపాటు నెలకు 16 కోడి గుడ్లు ఇవ్వాలన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేలా సహకరించాలని, వారి బరువును కొలుస్తూ పౌష్టికాహారాన్ని అందించాలన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ అంగన్వాడీ సెంటర్‌లో గ్రోత్ మానిటరింగ్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. పిల్లల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునేందుకు ఎత్తు, బరువు, చుట్టూ కొలతతో ఆరోగ్య పరిస్థితిని అంచనా వేశారు. కార్యదర్శి లలిత, అంగన్వాడీ టీచర్, పోరండ్ల కళ, ఆయా పల్లెర్ల శారద, పిల్లల తల్లిదండ్రులు, గర్భిణీలు, మహిళలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన బీజేపీ నాయకులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా శుక్రవారం జీఎంకాలనీ, తారకరామ్‌నగర్‌లలో అంగన్‌వాడీ కేంద్రాలను రామగుండం ఇంచార్జీ కందుల సంధ్యారాణి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పోషణ్ అభియాన్, పోషణ్ ట్రాకర్ యాప్, ఇ-అంగన్‌వాడీ మాడ్యూల్ వంటి పథకాల ద్వారా అంగన్‌వాడీ సేవలలో పారదర్శకత, సమర్థతను పెంచుతోందన్నారు. బండారి శ్యాం, మచ్చవిశ్వాస్, అంకరీ భరత్, రాదండి శ్రీనాథ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవకుడు అయిలయ్య మృతి



కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన సామాజిక సేవకుడు, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, రాష్ట్ర చేయూత ఫౌండేషన్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వ్యవస్థాపకుడు నీలం అయిలయ్య(48) శుక్రవారం మృతి చెందాడు. కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో శుక్రవారం ఉదయం అస్వస్థతకు గురైన అయిలయ్యను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అయిలయ్య నేత్రాలను సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెక్నిషియన్ ప్రదీప్‌నాయక్ సేకరించారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. అయిలయ్య మృతి పట్ల శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, రామకృష్ణారెడ్డి, నూక రమేష్,భీష్మాచారి, కెఎస్‌వాసు,సీఎల్‌సీ జిల్లా చైర్మన్ శ్రీధర్, బీజేపీ నాయకుడు పిడుగు కృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మల్లిఖార్జున్, అడ్వకేట్ సత్యం, పీజీ కళాశాల వాకర్స్ సంతాపం వ్యక్తంచేశారు.


త్వరలో గ్రంథాలయానికి పక్కా భవనం



గ్రంథాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ అన్నయ్య గౌడ్

ధర్మారం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ధర్మారంలో గ్రంథాలయానికి త్వరలో పక్కా భవన నిర్మాణం చేపడుతామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో లైబ్రేరియన్ నాగభూషణం, ఏఎంసీ చైర్మెన్ రూప్లానాయక్‌లతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ విప్ సహకారంతో గ్రంథాలయానికి భవన నిర్మాణం చేపడుతామని తెలిపారు. అనంతరం గెస్ట్‌హౌజ్‌లో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని పరిశీలించారు. మినరల్ వాటర్, కూలర్ ఏర్పాటు చేయించి ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించారు. రెండు రోజుల్లో అవసరమైన కుర్చీలు, టేబుల్లు, ఫ్యాన్లను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఏఎంసీ వైస్ చైర్మన్ లింగయ్య, పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, నాయకులు పాలకుర్తి రాజేశం, దేవి జనార్దన్, కాంపెల్లి రాజేశం, పాల్గొన్నారు.

శ్రీచైతన్య కళాశాలలో ట్రెడిషనల్ డే



చైతన్య కళాశాలలో ట్రెడిషనల్ డే వేడుకలో విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయ కాలనీలోని శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం ఘనంగా ట్రెడిషనల్ డే వేడుక నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణరెడ్డి హాజరై మాట్లాడారు. దేశంలో సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. వాటిని అనుసరించడమే దేశ గొప్పతనమన్నారు. పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపడతాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.యాకాంతం, వైస్‌ప్రిన్సిపల్ సిహెచ్ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

13న మహనీయుల జయంతి వేడుకలు

ఓదెల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కొలనూర్‌లో ఈనెల 14న నిర్వహించనున్న అంబేద్కర్ జయంతి, ఈనెల 13న జగ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతిరావుఫూలే జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ కన్వీనర్ మాటూరి రత్నం, కో కన్వీనర్ పల్లె కనకయ్య తెలిపారు. ఎమ్మెల్యే విజయ రమణారావుకు శుక్రవారం ఆహ్వాన పత్రికలను అందజేశారు. ప్రజలు, యువకులు, హాజరై విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ నాయకులు కోరారు.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతుందని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతం పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తుందని, రాబోయే కాలంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తుం గలో తొక్కే ప్రయత్నం చేస్తుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం శనివారం నుంచి యాత్రను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రారం భిస్తారన్నారు.

అంబేద్కర్ సమతా ర్యాలీని విజయవంతం చేయండి

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని భావితరాలకు వివరించేందుకు ఈ నెల 14న తలపెట్టిన అంబేద్కర్ సమతా ర్యాలీని విజయవంతం చేయాలని దళిత సంఘాల నాయకులు గుమ్మడి కుమారస్వామి, కాసిపేట లింగయ్య పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపర్చిన ఫలాలు దళితులకు అందడం లేదన్నారు.

బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఫూలే కృషి



జ్యోతిబాఫూలే విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్ కృష్ణయ్య

గోదావరిఖని, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి మహాత్మజ్యోతిరావుఫూలే కృషి చేశారని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఫూలే జయంతి సందర్భంగా బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్‌జీ-1 ఏరియా జీడీకే ఓసీపీ-5లో ఫూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ జ్యోతిరావు గోవిందరావ్ ఫూలే వెనుకబడిన బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేశాడని, ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గతంలో బీసీలపై ఎన్నో అవమానాలు, అణిచివేతలు, చిన్న చూపు ఉండేదన్నారు. బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలని సూచించారు ఉన్నత చదువుల ద్వారా ఉన్నత స్థానాలకు వెళ్ళటం బీసీలలో ఒక గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు. బీసీల పోరాటం ఆకలి పోరాటం కాదని, ఆత్మగౌరవ పోరాటమన్నారు. ఆర్‌జీ-1 జీఎం డీ లలిత్ కుమార్, ఎస్‌బీసీఈఏ వ్యవస్థాపకులు పంజాల శ్రీనివాస్, ఎస్‌బీసీఈఏ అధ్యక్షుడు వసంత్ కుమార్, బీసీ లైజన్ అధికారి పెరుమాళ్ళ శ్రీనివాస్, పీఓ చంద్రశేఖర్, ఎస్ఓఎం అనిల్‌గబాలే, దీటి చంద్రమౌళి, మల్లేశం, జనరల్ సెక్రటరి పూట్ల దేవాచారి, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ ఆరెల్లి పోషం, నాయకులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి జ్యోతిరావుఫూలే కృషి చేశారని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. రాజేష్ థియేటర్ వద్ద ఉన్న ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో అంతరాలను తొలగించి స్త్రీలకు విద్య, శిక్షణ కోసం కృషి చేశారని, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. నాయకులు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ముస్తాఫా, తిప్పారపు శ్రీనివాస్, నజీమోద్దీన్, రాము, పాల్గొన్నారు.

ఫూలే విగ్రహానికి రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అణగారినవర్గాల విద్య కోసం ఎనలేని కృషి చేసిన గొప్ప వ్యక్తి జ్యోతిరావు ఫూలే అన్నారు. బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, సీపీఎం నాయకులు వై యాకయ్య, వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడిగొప్పుల రాజు, ముప్పె సంపత్‌యాదవ్, మ్యాడగోని రవీందర్, ఆరెల్లి జలేందర్, లింగన్న, అంజయ్య, శ్రీనివాస్, అరవింద్ పాల్గొన్నారు. టీడీపీ నాయకులు ఏడుకొండలు ఆధ్వర్యం లో ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): మహానీయుల చరిత్రను ప్రజలకు చాటి చెబుతామని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మహాత్మా జ్యోతిబా ఫూలే జయంతి పురస్కరించుకొని మంథనిలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. పుట్ట మధు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలన అంటూ చెప్పుకుంటున్న ప్రభుత్వం మహానీయుల ఉత్సవాలు జరుపుకోకుండా అణిచి వేస్తుందన్నారు. మహనీయుల చరిత్రను తెలుసుకోవడంతో పాటు సమాజానికి తెలియజేసేలా మహానీయుల స్ఫూర్తి దీక్షను తీసుకున్నా న న్నారు. దీక్షను ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగిస్తామన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి, మంథనిలో ఎమ్మెల్యే ప్రతిపక్షాల గొంతునొక్కే ప్రయత్నాలు చేస్తూ దోపిడి పాలన చేస్తున్నారని ఆరోపించారు. నాయ కులు జక్కు రాకేష్, ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, మాచీడి రాజుగౌడ్, గొబ్బూరి వంశీ, పుప్పాల తిరుపతి, పాల్గొన్నారు. కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో ఫూలే జయంతి నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, శ్రీని వాస్‌ల ఆధ్వర్యంలో రచ్చపల్లిలో, సీపీఎం పార్టీ నేత బూడిద గణేష్ అధ్వ ర్యంలో కాకర్లపల్లి శివారులో, బీజేపీ నేతలు గుంజపడుగులో ఫూలే జయంతి నిర్వహించారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): కొలనూర్ రైల్వే గేట్ వద్ద ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో జ్యోతిరావుఫూలే జయంతి వేడుకలను నిర్వహించారు. పలువురు నాయకులు ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫూలే చేసిన సంఘ సేవను గుర్తు చేశారు. గుండేటి ఐలయ్య, ఐలయ్య గౌడ్, సాతూరి రాజేశం,ఆసరి ఎర్రయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జ్యోతిరావుఫూలే జయంతి నిర్వహించారు. పిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమాకాంత్ ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. అధ్యాపకులు డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ రవి, అజయ్‌కుమార్, యాదయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసాద్, ఎంబీఏ, ఎంకామ్, ఎమ్మెల్సీ విద్యార్థులు పాల్గొన్నారు.



ఫూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న పుట్ట మధు, బీఆర్ఎస్ శ్రేణులు

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు బాల్‌రాజ్‌పల్లి గ్రామాల్లోఫూలే జయంతిని బీసీ కులాల నాయకులు ఘనంగా నిర్వహించారు. జూలపల్లిలో పద్మశాలిల ఆధ్వర్యంలో, బాల్‌రాజ్‌పల్లిలో మాజీ ఉప సర్పంచ్ అడువాల తిరుపతి ఆధ్వర్యంలో ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెరుగు రమేష్, దండె వెంకటేశం, కుంటూరి రాజయ్య, కోరికంటి హరికిషన్, జనార్దన్, కొల్లూరి స్వామి పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఫూలె జయంతి దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. సమానత్వం, స్వేచ్ఛ, ఐకమత్యంతో కూడిన సమాజాన్ని కాంక్షించిన మహోన్నత వ్యక్తని కొనియాడారు. చంద్రయ్య, దుర్గయ్య, కొండయ్య, శ్రీనివాస్, కట్ల ప్రకాష్, దూడం వీరేశం, ఇరుగురాల సదానందం, బాసంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి) : మహాత్మాజ్యోతిరావు ఫూలే జయంతిని ఆయాపార్టీల నాయకులు నిర్వహించారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామడి తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు, గాజనవేన సదయ్య, ఆడెపు రాజు, గోలి సుధాకర్, పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలో జ్యోతిరావుఫూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జ్యోతిరావు ఫూలే జాతికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. రేండ్లకుమారస్వామి, బొంకూరి పోచం, కిష్టయ్య, బూస కనకయ్య, శ్రీనివాస్, పాల్గొన్నారు.

పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి): ట్రినిటీ బీఈడీ, డీఈడీ ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో ఫూలే జయంతి నిర్వహించారు. మహిళలకు విద్య ఆవశ్యకత గురించి వివరిస్తూ తొలి ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి ఫూలేను తీర్చిదిద్ది మహిళల్లో అక్షరాస్యతను తీసుకువచ్చిన ఘనత ఆయనదేనని అన్నారు. ట్రినిటీ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డమ్మ హరి, బుర్ర తిరుపతి, రజని, అధ్యాపకులు దిలీప్‌శర్మ, మధూకర్, రమేష్, సుజాత, అనురాధ, సునీత, జ్యోతి, శారధ తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): ఫూలె జయంతిని కాలనీలో రాజకీయ పార్టీలు వివిధ సంస్థలు నిర్వహించాయి. తెలంగాణ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు, బీఎంఎస్ ఆఫీస్‌లో బీజేపీ నాయకులు ఫూలె చిత్రపటాలకు నివాళులర్పించారు. గుండేటి రాజేష్, మారెల్లి రాజిరెడ్డి, శంకర్‌నాయక్, సాగంటి శంకర్‌లు పాల్గొన్నారు. మూకిరి రాజు, ఎస్కే పాష, మారెపల్లి శ్రీనివాస్, ఆకుల శశికుమార్, గంధం శంకర్ పాల్గొన్నారు.



గోదావరిఖనిలో ఫూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే చందర్, కాల్వశ్రీరాంపూర్‌లో పాల్గొన్న నాయకులు

అట్టడుగు వర్గాల ప్రజలకు అండగా బీజేపీ

సుల్తానాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అట్టడగు వర్గాల వారికి బీజేపీ అండగా ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అన్నారు. గావ్ ఛలో..బస్తీ ఛలో కార్యక్రమంలో భాగంగా సుభాష్‌నగర్‌లో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. అంతకు ముందు ప్రభుత్వ పాఠశాలలో, పెరికిగిద్దె ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రమదానం చేశారు. సుభాష్‌నగర్ దళితవాడలో ఆ ప్రాంత ప్రజలతో కలసి సహపంక్తి భోజనం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని గొప్పలు చెబుతున్నారని ప్రశ్నించారు. పేదలకు బియ్యం ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమేనని, ఒకరికి ఐదు కిలోలు ఉచితంగా ఇస్తుందన్నారు. ప్రతీ రేషన్ షాపులో ప్రధాని మోదీ ఫోటో పెట్టేలా కార్యకర్తలు డీలర్లను నిలదీయాలన్నారు. పేద ప్రజలకు బీజేపీ నాయకులు సామాజిక సేవకుడు మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ చీరలు, దోవతులు, ఇతర వస్త్రాలను అందజేవారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ రావు, కార్యదర్శి మహేందర్ యాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చాతరాజు రమేష్, పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, వనజ, పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): ధూళికట్టలో బీజేపీ శ్రేణులు గావ్‌చలో-బస్తీచలో కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ సెంటర్, రేషన్‌షాపులను సందర్శించారు. ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. దళితవాడలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. గర్రెపల్లి నారాయణస్వామి, ఎర్రోళ్ల మల్లేశం, ఊర జగన్నాథరావు, మల్లారపు అంజయ్య, పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): జాఫర్‌ఖాన్‌పేటలో బీజేపీ నాయకులు బస్తీ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వివరించారు. నాయకులు గూడెపు జనార్దన్‌రెడ్డి, ల్యోజు వెంకటేశ్వర్లు, ఎండి.రఫీ, ఓర్పుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గరీబ్‌కళ్యాణ్ అన్నయోజనతోనే సన్నబియ్యం

కోల్‌సిటీ టౌన్, (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా ప్రతీ ఒక్కరికి 5 కిలోల సన్నబియ్యం అందిస్తున్నామని ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసిపేట శివాజీ, మహిళామోర్చా రాష్ట్ర కార్యదర్శి సోమారపు లావణ్య అన్నారు. 11వ డివిజన్‌లో బూడిద రమేష్ ఆధ్వర్యంలో రేషన్‌షాపులను సందర్శించి డీలర్లతో, లబ్ధిదారులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కరోనా నుంచి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుందని, ఇటీవల సన్నబియ్యాన్ని అందిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తామే అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటుందని ఎద్దేవా చేశారు. రేషన్‌షాపుల వద్ద మోదీ చిత్రపటాలను, పథకం వివరాలు ఏర్పాటు చేయాలని డీలర్లను డిమాండ్ చేశారు. నాయకులు పెద్దపల్లి రవీందర్, మహావాది రామన్న, ములుకుంట్ల రజిత, గోపగాని నవీన్, గాదె రాజమల్లు, పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం పోరాటం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు సాధించేవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఐఎంఏ హాల్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్నారన్నారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తామంటూ ఆయా ప్రభుత్వాలు హామీ ఇస్తున్నారే కాని నెరవేర్చడం లేదన్నారు. హెల్త్ కార్డులు సక్రమంగా పనిచేయడం లేదని, దశాబ్దంగా ఇళ్ల స్థలాలు ఇల్లు ఇచ్చిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే దశల వారీగా పోరాటం చేస్తామని అన్నారు. గతంలో ఉన్న జర్నలిస్టులకు రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలని తీర్మానించారు.

వక్ఫ్ బిల్లును వెంటనే రద్దు చేయాలి

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని ముస్లిం వ్యాపారులు స్వచ్ఛందంగా శుక్రవారం వ్యాపార వాణిజ్య దుకాణాలను మూసి బంద్ పాటించారు. ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా తీసుకువచ్చిన బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ర్యాలీని అడ్డుకొన్న పోలీసులు

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్ట సవ రణను నిరసిస్తూ గోదావరిఖనిలో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నించారు. గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. అనుమతి లేకుండా నిరసన ర్యాలీలు, ఆందోళనలు చేయవద్దని సూచించారు. అనంతరం ఆందోళన విరమించారు. ఫసియోద్దీన్, ఫజలుద్దీన్, రియాజ్ పాల్గొన్నారు.

రైస్‌మిల్లు గుమస్తాల సమస్యలు పరిష్కరించాలి

సుల్తానాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లు గుమస్తాల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ముత్యంరావు పిలుపునిచ్చారు. శుక్రవారం సమావేశం నిర్వహించారు. 15 మందితో కమిటిని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాతంగి శంకర్, ప్రధాన కార్యదర్శిగా కందునూరి భగవాన్, ఉపాధ్యక్షుడిగా వేగోళం అనిల్, ఉస్తం వినయ్, కోశాధికారిగా పెగడ కిషన్, కార్యదర్శులుగా చొప్పరి అనిల్, గౌతం, చాణక్య, ప్రచార కార్యదర్శులుగా మహేష్, రాజ్‌కుమార్ తదితరులు ఎన్నికయ్యారు.

ఆర్.కృష్ణయ్యకు ఘన స్వాగతం

అంతర్గాం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రామగుండం రైల్వే స్టేషన్‌లో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్యకు బీజేపీ రామగుండం నియోజక వర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పార్టీ శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికారు. రామగుండంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కృష్ణయ్య రైలులో రాగా బీజేపీ నాయకులు స్వాగతం పలికి సన్మానించారు. బీసీల హక్కుల కోసం, సమస్యలపై మరింత పట్టుదలతో పోరాడాలని కృష్ణయ్యను సంధ్యారాణిపోచం కోరారు. తిరుపతి, కుమార్, అశోక్, కరుణాకర్ పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ సందర్శన

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీలోని రేణుకాఎల్లమ్మ తల్లిని శుక్రవారం రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య శుక్రవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. గున్నాల శ్రీధర్‌గౌడ్, హన్మంత్‌గౌడ్, బాలసాని స్వామిగౌడ్, కోట రవిగౌడ్, సురేందర్‌గౌడ్, సిరిశెట్టి తిరుపతిగౌడ్, బిందె నాగభూషణం, మాచిడి మహేందర్‌గౌడ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మున్సిపల్ అటెండర్ సస్పెన్షన్

పెద్దపల్లిటౌన్, ఎప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి)పురపాలక సంఘ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న పోల రమేష్‌ను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్‌శ్రీ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విధుల్లో నిర్లక్ష్య ధోరణి వహిస్తూ విధులకు రాక పోవడంతో మెమోలు జారీ చేసిన స్పందించలేదు.

అంబేద్కర్ జయంతి ఏర్పాట్లపై సమీక్ష

రామగిరి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న నిర్వహించ తలపెట్టిన రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఏర్పాట్లపై శుక్రవారం ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు అధికారులతో సమీక్ష నిర్వహించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణం లోని సీఈఆర్ క్లబ్‌లో జయంతి ఏర్పాట్లను సత్వరం పూర్తి చేయాలని సూచించారు. అధికారులు శేఖర్‌బాబు, సత్యనారయణ, చంద్రశేఖర్, రాజేంద్రకుమార్, సుధర్శనం, జనార్ధన్‌రెడ్డి, ఐలయ్య, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జీఎం

ఆర్జీ-2లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫూలే జయంతి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావ్‌ఫూలె జయంతి నిర్వహించాయి. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో యూనియన్ ఆఫీస్‌తో పాటు కృషిభవన్, సీహెచ్‌పీ, వర్క్‌షాప్ ఎస్‌అండ్‌డీ, వీకేపీ గనిలో ఫూలె చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, నాయకులు ప్రకాష్, అన్నారావు, శ్యాంసన్, సాంబశివరావు, సత్యనారాయణలు పాల్గొన్నారు. ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో వైస్ ప్రెసిడెంట్ శంకర్‌నాయక్, నాయకులు సత్యనారాయణరెడ్డి, దశరథం, రవీందర్ పాల్గొన్నారు. ఓసీపీ-1 సైటాఫీస్‌లో ప్రాజెక్టు అధికారి రాజశేఖర్, పీఈ ఉదయ్‌భాస్కర్, ఐఎన్‌టీయూసీతో పాటు ఇతర యూనియన్ నాయకులు గడ్డం తిరుపతి, వెంకటస్వామి, నాగెల్లి సాంబయ్య, భాస్కర్, ప్రభాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.



ఆర్జీ3, ఏపీఏలో ఫూలే జయంతి

రామగిరి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపిఏ డివిజన్‌లలో మహత్మా జ్యోతిరావుఫూలే జయంతి నిర్వహించారు. జీఎం కార్యాలయంతోపాటుగా టిటూ సెంటర్‌లలో ఆర్జీ-3, ఏపిఏ జీఎంలు సుధాకర్ రావు, నాగేశ్వర్‌రావులు ఫూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాలర్పించారు. బిసి లైజన్ ఆఫీసర్ చంద్రశేఖర్, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్రారెడ్డి, కొటరవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా జీఎం ఆఫీస్‌లో మహత్మా జ్యోతిరావ్ ఫూలె జయంతి నిర్వహించారు. అఫీషియేటింగ్ జీఎం రాముడు ముఖ్య అతిథిగా హాజరై ఫూలె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేశారు. బీసీ లైజనింగ్ ఆఫీసర్ వేణుగోపాల్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, సీఎంఓఏఐ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మేరపల్లిలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ మాలధారులు హనుమాన్ ప్రతిమతో డిజే సౌండ్‌ల మధ్య శోభాయాత్ర నిర్వహిస్తూ జై శ్రీరాం నినాదాలు చేశారు. శోభాయాతకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంథని, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మంథని మున్సిపాలిటీ, మండలంలోని గుంజపడుగు, నాగారం సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ గురువారం తెలిపారు. సబ్ స్టేషన్లలో రిపేర్ల కారణంగా కరెంట్ కోత ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా భూమల చందర్

జ్యోతినగర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా భూమల చందర్ నియమితులయ్యారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ఎన్‌టీపీసీ టౌన్‌షిప్‌లోని మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో చందర్ మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన సంజీవరెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు,ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, విజయరమణారావులకు చందర్ కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు రాజేశ్వర్, వేముల కృష్ణయ్య, జమీల్‌పాషా, గోషికరవి, బొద్దుల శ్రీనివాస్, వెంకటేష్, లక్ష్మయ్య, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతి

రామగిరి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలకు తగిన వేతనం అందించాలని శుక్రవారం బిజెపి మండల అధ్యక్షుడు కొండు లక్ష్మన్ ఎంపీడీవో శైలజా రాణికి వినతి పత్రం అందజేశారు. ఉపాధి హామీ కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు తొట్లరాజు, నాయకులు సంపత్, కందుల రమేశ్, మణికంఠ, శివ పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ అందరి బాధ్యత

అంతర్గాం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలందరికీ సమన్యాయం చేసే రాజ్యాంగాన్ని రక్షించుకునే బాధ్యత ప్రజలందరిపై ఉందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి హరి ప్రసాద్ అన్నారు. శుక్రవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన కార్యక్రమంలో భాగంగా రామగుండంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ రాజకీయంగా లబ్ధి పొందుతున్నదని విమర్శించారు. నాయకులు బందారపు బుగ్గ రాములుగౌడ్, ఈసంపల్లి అంజయ్య, ఓదెల రాజమౌళి, మహమ్మద్ షరీఫ్, సిరిశెట్టి సతీష్‌గౌడ్, బొద్దుల శంకర్, సూర తార పాల్గొన్నారు.